నాలుగ్గంటలకి ఆఫీసుకెళ్లాను. ఉద్యోగం పోయిందన్న విషయం వెంటనే తెలిసిపోయింది. వెంటనే అమీర్‌పేట ప్రియా ప్లేస్‌మెంట్స్ లోకెళ్లాను.

అక్కడినుంచీ బేగంపేట ప్రదీప్ దగ్గరికెళ్లాను, ఏవైనా చూస్తాడేమోనని. విశర్‌కి తెలిసిన వాళ్లెవరికో పర్సనల్ కావాలని చెప్పింది. ఆ అడ్రస్ నీ దగ్గరుంది కదా అని నీకు ఫోన్ చేసాను. పొద్దున్న వస్తావన్నావు కదా అని, అక్కడే కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న మినతి దగ్గరికెళ్లాను. ఫాకల్టీ ఇష్టం అయితే వెళ్లమని దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్ డిపో దగ్గరున్న ఓ కాలేజ్ అడ్రస్ ఇచ్చింది..."

"దిల్‌సుఖ్‌నగర్ వెళ్లి రెస్యూం ఇచ్చి, ఇంటికొచ్చేటప్పటికి ఎనిమిదిన్నర దాటింది. దాదాపు ఐదు గంటలు కంటిన్యుయస్‌గా బయట తిరగడం వల్ల విపరీతమైన తలనొప్పి, కడుపులో తిప్పడం. నాకు ఏస్ప్రోలు, క్రోసిన్‌లో వేసుకుంటే కడుపులో మంట, గుండెల్లో మంట వస్తుంది కదా, హోమియోపతిక్ పిల్స్ తలనొప్పి కోసంవి ఉన్నాయి. మంచం పక్కనే ఉన్న సైడ్ టేబిల్ సొరుగులోని బాటిల్‌లోని మాత్రలు వేసుకున్నాను. అది... మరి... అయితే...అయోమయంగా"అంది.

"అవి హోమియోపతిక్ పిల్స్ కావు" అంది సుమిత్ర.

"అయితే నేను వేసుకున్నది..." సగంలో ఆగింది.

"పిచ్చి పిల్లా! అవి నా నిద్రమాత్రలు. లేబిల్ చూడకుండా ఎలా వేసుకున్నావు?" అంటూ కాళ్ల మీద ఓ దెబ్బ చిన్నగా వేసింది.

ఆత్మహత్య అనుకున్నారు. "ఆత్మహత్య చేసుకునేంత పిరికిదాన్ని కాదు."

"నీ కూతుర్ని మమ్మీ! డాడీతో విడిపోయినా, జీవితం అయిపోలేదు అన్న ధైర్యం నీ శ్వాస. అదే ఊపిరి నేను కూడా పీలుస్తున్నాను.

అయాం డిప్రెస్డ్ బట్ నాట్ డిఫీటెడ్. ఛాలెంజ్, ఛేంజ్‌లు లేనిది జీవితమా! ఆశా జీవిని. మంచే జరుగుతుంది.

పాజిటివ్ థింకింగ్ నీ దగ్గర్నుంచి నేను నేర్చుకుంటున్నాను"

దీక్ష సుమిత్ర నీళ్లు నిండిన కళ్లతో మసకబారిన చూపుని క్లియర్ చేసుకుని ఆమెను చూస్తూండిపోయారు.

❖ 30.1.2003, భూమి సచిత్ర వార పత్రిక ❖

❖❖❖